# స్నేహంకన్న తీయనిది

[జ్యోతి మాసపత్రిక]

'సృష్టిలో తీయనిది స్నేహమేనోయీ....'
అన్నారొక మహాకవి. మానవత్వపు విలు
వలు మంటగలిసి పోయిన ఈ యాంత్రిక
యుగంలో స్నేహం కంటే తీయనిది మరొ
కటి తయారయిందేమో!....

విశ్వనాథం రాజుపాలెం జంక్షనులో బస్సు దిగేడు.

పై మీది ఉత్తరీయం సవరించుకుంటూ, చుట్టూ కలయజూశాడు. ఎడంగా రోడ్డు అవతల రావిచెట్టు కింద విశ్రాంతి తీసుకుంటున్న నలుగురు రిక్షావాళ్ళు ఒక్కసారిగా లేచివచ్చి, అతడిని చుట్టు ముట్టేరు.

అందులో ఒకడు చొరవగా విశ్వనాథం చేతిలోవి సంచీ అందుకుని "ఎక్కడికి వెళ్లాలి బాబూ!" అంటూ అడిగేడు.

"పాలెం వూళ్ళోకి వెళ్ళాలి!" అన్నాడు.

"ఎక్కండి బాబూ!" అంటూ రిక్షా సీటు సరిచేసి చేతిగుడ్డతో తుడిచేడు.

సంచీని ఒక వారగా సీటులో సర్దిపెట్టాడు.

"ఎంతివ్వమంటావ్?"

"తమకు తెలియందేముంది?...."

"ఎంతో చెప్పు!"

"రెండు రూపాయలు బాబూ...."

"రూపాయిన్నర ఇస్తాను...."

"కట్టలేం బాబూ!" అన్నాడు రిక్షావాడు! తనే కాదు, ఎవ్వరూ కట్టరన్న ధ్వని సూచిస్తూ!

కొంతసేపు విశ్వనాథం మాట్లాడలేదు!

మళ్ళీ రిక్షావాడే అన్నాడు—"తమలాటి పెబువులు మాలాటి బీదోళ్ళ కష్టం సూడాలి!"

విశ్వనాథం దీర్ఘంగా నిట్టూర్పు వదిలేడు.

"సరే పద" అంటూ రిక్షా ఎక్కి కూర్చున్నాడు.

రిక్షా జంక్షను వదిలి మట్టిరోడ్డు పట్టింది.

విశ్వనాధం రిక్షాలో సర్దుకుని కూర్చున్నాడు.

మనసులో రిక్షావాడి మాటలు మననం చేసుకున్నాడు.

'అతడి దృష్టిలో తనో ప్రభువు!

తానెక్కింది రిక్షాకాదు! పల్లకీ కాబోలు!'

ఆలోచనలకు నవ్వొచ్చింది విశ్వనాధానికి.

తనా?!!

తాను చదువుకునే పిల్లల దృష్టిలో బతకలేని బడిపంతులు! భార్య కాంతమ్మ దృష్టిలో బతకటం చేతకాని బడిపంతులు! కూతురు లక్ష్మి దృష్టిలో తనకి ఎప్పటికీ పెళ్ళి చేయలేని బీద బడిపంతులు!

అలాటి తాను— రిక్షావాడి కష్టం చూడాలి!

కానీ, తన కష్టం ఎవరు చూస్తున్నారు??

ఏడాది పొడుగునా పాఠాలు చెప్పించి, రావాల్సిన 'ఎరియర్స్' ఇవ్వని స్కూలు కమిటీ వారా?

ఎంత జాగ్రత్తగా పాఠాలు చెప్పినా, సర్కారువారి బహుమతులు పొందినా, ఇంకా ఏ టీచింగ్ నోట్స్ సరిగ్గా లేదని వంకలు పెట్టే హెడ్మాస్టరా?

తమ పిల్లలకు ప్రయివేట్లు చెప్పించుకుని నెలాఖరున డబ్బులు ఎగవేసే పిల్లల తల్లి తండ్రులా?

ఎవరు చూస్తున్నారు తన కష్టం?

కానీ, తాను రిక్షావాడి కష్టం గమనించాలి.

దీర్ఘంగా నిట్టూర్చి, చుట్టూ కలయజూశాడు విశ్వనాధం.

రోడ్డుకు ఇరువైపులా వున్న సర్వేచెట్లు, చిన్న పొదలు మెల్లగా వెనక్కి మిగిలిపోతున్నాయి.

ఎండ తీవ్రత హెచ్చుగానే వుంది.

కుడిప్రక్కగా ఎండిపోయిన కొండవాగు.

ఎండకు వాగులోని పొడి ఇసుక తమాషాగా మెరుస్తోంది.

వాగుకు అవతలి వైపున దట్టమైన మామిడి తోపు! ఇంకా వెనుక

దూరంగా పచ్చని కొండలు! అంతా ఏజెన్సీ ఏరియా! నిండా ప్రకృతి సంపద!!

రిక్షా రోడ్డుమీద గతుకుల్లో పడుతూ లేస్తూ వెళ్తోంది.

పెద్ద గోతిలో పడినప్పుడల్లా రిక్షాలోపల సీటు ముందుకు జారిపోతోంది.

వెనక్కి సర్దుకుని కూర్చున్నాడు విశ్వనాథం.

చేతి సంచీ కిందపడిపోకుండా ఒక వారగా సర్దేడు.

పాలెం ఊళ్ళో తాను వెళ్ళబోయేది సుందర్రామయ్య ఇంటికి.

సుందర్రామయ్యా, తనూ చిన్ననాటి స్నేహితులు.

వీధి అరుగు బడినాటనుండీ కలిసి చదువుకున్నారు. ఒకే కంచంలో తిన్న రోజులూ వున్నాయి. ఒకే మంచంమీద నిద్రపోయిన వతు పెరిగేరు.

స్కూలుకు వెళ్ళినా, ఎగ్గొట్టి తోటల్లో తిరిగినా కలిసే చేశారు. ఒక రోజున ఈమని వారి తోటలో సువర్ణరేఖ మామిడి పళ్ళు తాను చెట్టెక్కి తెంపుతూ వుంటే మిగిలిన పిల్లలు ఏరుతున్నారు. సరిగ్గా ఆ సమయంలో తోట కాపు వచ్చేడు. పిల్లలు అందరూ పారిపోయేరు, ఒక్క సుందర్రామయ్య తప్ప!!

తామిద్దరూ కలిసి తోటమాలిచేత తన్నులు తిని ఇంటికి తిరిగి వచ్చేరు. అప్పటికే ఇంటిలో ఈ సంగతి తెలిసిపోయింది! అందువల్ల మళ్ళీ ఇద్దరూ కలిసి తన తండ్రిచేత తన్నులు తిన్నారు.

స్నేహానికి ప్రాణమిచ్చే మనిషి సుందర్రామయ్య.

తాను స్కూలు ఫైనలు పూర్తిచేసి, టీచరు ట్రయినింగు అయిందనిపించి జీవితంలో బడిపంతులుగా స్థిరపడిపోయాడు.

ఈ ముప్ఫయి రెండు సంవత్సరాల టీచరు గిరీ తనకో చిన్న పెంకుటింటినీ, బేంకులో రెండువేల రూపాయల ఎకౌంటునూ, అనుక్షణం తన అసమర్థతను ఎత్తి చూపించే భార్య కాంతమ్మనూ, వివాహానికి ఎదిగి గుండెలమీద కుంపటిలా తయారయిన కూతురు లక్ష్మినీ మిగిల్చింది.

సుందర్రామయ్య చాలా తెలివయినవాడు.

అందుకే స్కూల్ ఫైనల్ పూర్తయ్యాక టీచర్ ట్రయినింగు అవలేదు.

చదువు మానేశాడు!

మానేసి వ్యాపారంలోకి దిగేడు!

చిన్న చిన్న వ్యాపారాలు చాలా చాలా చేసేడు.

బొగ్గుల కొట్టు లగాయితు బట్టలకొట్టువరకూ అన్నిరకాల వ్యాపారాలూ చూసేడు.

కన్యాకుమారి మొదలు కటక్ వరకూ కలయ తిరిగేడు.

వ్యాపారానికి కావల్సిన జ్ఞానం అంతా సముపార్జించుకున్నాడు.

అతడు చేసిన ఏ వ్యాపారంలోనూ నష్టపోయినట్లు తాను వినలేదు.

వ్యాపారంలో కాస్త నిలదొక్కుకున్నాక అతడు పెళ్ళి చేసుకున్నాడు.

తన పెళ్ళికి మూడేళ్ళ ముందే అతని పెళ్ళి అయింది.

తర్వాత అతడు ఏలూరు వదిలేశాడు.

ఏజెన్సీ ప్రాంతానికి తరలివచ్చి కలప వ్యాపారం ఆరంభించేడు.

తర్వాత చాలా సంవత్సరాలు తామిద్దరూ కలియలేదు. ఉత్తరాలు వ్రాసుకునే అలవాటు ఇద్దరికీ శూన్యమే!!

నాలుగు సంవత్సరాల క్రితం—

తాను ఏదో పనిమీద విశాఖపట్నం వెళ్తే అక్కడ బస్టాండులో కన్పించేడు సుందర్రామయ్య. ఖరీదయిన బట్టల్లో తళతళలాడిపోతున్నాడు. చేతివేళ్ళకు మెరిసే వజ్రపు ఉంగరాలు!!

తాను పాలెంలో వున్నట్లూ, చుట్టూ అడవిలోని వంట చెరుకు నరికించి అమ్ముకునే కంట్రాక్టు తీసుకున్నట్లూ చెప్పేడు. వ్యాపారం వేల పరిధి దాటిపోయి లక్షల పరిధిలో పడిందని అతని మాటల వలన అర్థమయింది.

తనను గురించిన వివరాలన్నీ చాలా ఆప్యాయంగా అడిగి తెలుసుకున్నాడు సుందర్రామయ్య!

"నీకు వీలు కుదిరినపుడు పాలెం వచ్చి, మా ఇంట్లో నాలుగు రోజులు వుండి వెళ్ళు" అంటూ ఆహ్వానించేడు.

వాడి స్థితికి, అంతకు మించి వాడు తన యెడల చూపించిన అప్యాయతకు చాలా గర్వించేడు తాను

అంతలోనే తను ఎక్కాల్సిన బస్సు వచ్చింది.

శెలవు తీసుకొని వచ్చేశాడు తాను.

ఆ తర్వాత.....ఈ మధ్యలో అతడి వివరాలు ఏమీ తెలియ లేదు!

సుమారు ఆరు నెలల క్రితం .... తమ ఇద్దరికీ ఉన్ననాటి స్నేహితు డయిన ప్రకాశం ఏలూరు వచ్చేడు.

అతడు మాటల సందర్భంలో .... 'సుందర్రామయ్యకి ఒక కొడుకున్నాడు, కుర్రాడు బాగానే వుంటాడు. మీ అమ్మాయి లక్ష్మికి మంచి ఈడుగా వుంటాడు! నీ కూతురి అందం తక్కువేం కాదు! ఆ కుర్రాడికి చేసుకొమ్మని సుందర్రామయ్యను అడుగు!' అంటూ హిత బోధ చేశాడు తనకు!

ఆ హిత బోధను తాను అప్పట్లో అంతగా పట్టించుకో లేదు!

కాని తన భార్య కాంతమ్మ మాత్రం ఆ మాట విని ఎంతో ఆనందం పొందింది. ఆనాటి నుండీ ఈ సంబంధానికి ప్రయత్నాలు చేయమని చెవిలో ఇల్లు కట్టుకొని మరీ పోరు ప్రారంభించింది.

కయ్యమయినా, వియ్యమయినా సమానులతోనే సాధ్యపడుతుం దని నమ్మేవాడు తను!

కానీ, భార్య మాటలతో ....

కూతురు సుఖాన్ని దృష్టిలో పెట్టుకుని యోచిస్తే....

స్వార్థం అడ్డు నిలిచింది!

కొద్ది దినాల తర్వాత ... 'పోనీ, సుందర్రామయ్యను ఈ పెళ్ళి సంబంధం విషయం కదిపి చూస్తేనో?' అని అనిపించింది తనకు.

రాను రాను ఆశ బలవత్తర మయింది.

బలవత్తర మయిన ఆశ మదిలో నిలిచింది.

మదిలో నిలిచిన ఆశ మొగ్గ తొడిగింది.

కూతురుకు మంచి సంబంధం చేయాలనే కోరిక బలపడి, ఆ ఆశ పువ్వుగా వికసించింది.

తన కూతురు లక్ష్మి అందంగా వుంటుంది.

చిదిమి దీపం పెట్టుకో వచ్చును!

తన ఆస్తిని చూసి కాక పోయినా, లక్ష్మి అందాన్ని చూసి అయినా సుందర్రామయ్య తన కొడుక్కి చేసుకోవచ్చు. ఈ సంబంధం చేస్తే లక్ష్మి భోగభాగ్యాలతో తులతూగుతుంది.

అసలు ఆమె తన ఇంట పుట్ట వలసిన పిల్లకాదు. ఏ భాగ్యవంతుల ఇంటనో పుట్టి సర్వ భోగాలూ అనుభవించాల్సిన లక్ష్మి కళ ఆమె ముఖంలో వుంది.

సుందర్రామయ్యను ఈ సంబంధానికి వప్పించగలిగితే తన జన్మ ధన్యమయినట్టే!!

తన వద్ద వున్న రెండు వేలూ కాక, మరో రెండు వేలు అప్పు చేస్తే వివాహం ఘనంగా జరిపించ వచ్చును.

ప్రావిడెంటుఫండుతో అప్పు తీర్చెయ్య వచ్చును.

ఈ పెళ్ళితో తన బాధ్యత తీరిపోతుంది!

స్వంత లోగిలిలో....

తనకు వచ్చే పెన్షన్ డబ్బులతో....

తనకూ భార్యకూ రోజులు గడవక పోవు!!

ఆలోచనల్లో మునిగి వున్న విశ్వనాథానికి గ్రామంలోనికి చేరుకున్న సంగతే తెలియలేదు.

"ఎవరింటికి బాబూ!"

రిక్షావాడి పిలుపుకు ఈ లోకంలోకి వచ్చేడు విశ్వనాథం.

"సుందర్రామయ్య గారింటికి!"

రిక్షావాడు దిగి మెల్లగా గోతుల్లోంచి నడిపిస్తున్నాడు.

సుందర్రామయ్యకు జున్ను అంటే చాలా ఇష్టం. భార్యతో తానీ విషయం చాలా మార్లు మాటల సందర్భంలో చెప్పేడు. నిన్న ఉదయం పక్కింటి వాళ్ళ గేదె ఈనింది. వాళ్ళ దగ్గర జున్ను పాలు తీసుకుని జున్ను వండి చిన్న కేరియరులో పెట్టి ఇచ్చింది భార్య.

"మీ స్నేహితుడికి జున్ను ఇవ్వండి, సంతోషిస్తాడు" అంటూ। జున్ను కేరియరు ఒరిగిందేమోనని సంచీ సర్ది చూసేడు విశ్వనాథం.

శ్రీకృష్ణుని వద్దకు సంపదల కోసం బయలు దేరిన కుచేలుని స్థితి గుర్తుకు వచ్చిందతనికి.

కాకపోతే....మిత్రునికి యివ్వబోయేవి అటుకులు కావు।

అతనికి అతి ప్రియమైన జున్ను!

అడగబోయేవి సంపదలు కావు!

అంతకు మించిన సంబంధం!!

నవ్వు కున్నాడు తనలో తనే!

రిక్షా ఓ పెంకుటింటి ముందు ఆగింది.

"దిగ డి బాబూ"

రిక్షావాడి పిలుపుతో ఈలోకంలో పడ్డాడు విశ్వనాథం.

మెల్లగా రిక్షా దిగేడు!

చుట్టూ కలయ జూశాడు!

ఇల్లు చూసేసరికి అతడికి అనుమానం కల్గింది.

"కలప వ్యాపారి సుందర్రామయ్యగారి ఇల్లు ఇదేనా?" మరొక సారి అడిగేడు.

"అవును బాబూ, ఇదే!"

రిక్షావాడు నిశ్చయంగా చెప్పి, తనకు రావాల్సిన డబ్బులు తీసుకుని వెళ్ళిపోయాడు.

మెల్లగా లోగిలి మెట్లెక్కి తలుపులు తట్టేడు.

తలుపులు తెరుచుకున్నాయి.

ఎదురుగా సుందర్రామయ్య భార్య శేషమ్మ!

ఆమెను చూసి చాలా కాలమయినా, గుర్తుపట్ట గలిగేడు. ఆమెలో వార్ధక్యం నీడలు అప్పుడే బాగా పడుతున్నాయి. తల అక్కడక్కడ బాగా నెరిసి పోయింది.

ఆవిడ తన వంక గుర్తుపట్ట లేనట్టుగా చూస్తూ వుండి పోయింది.

“నేను విశ్వనాధాన్ని! ఏలూరు నుండి వస్తున్నాను!” అన్నాడు.

“మీరా బాబూ.... రండి....రండి! చూపు సరిగ్గా ఆనక గుర్తించ లేక పోయాను” అంటూ లోనికి దారి తీసింది.

“కూర్చోండి”

కుర్చీ చూపించి, గబగబా వంటింట్లోకి వెళ్ళి గ్లాసుతో దాహం తీసుకు వచ్చింది.

అంతలోనే పెరట్లోంచి సుందర్రామయ్య లోనికి వచ్చేడు.

“ఇంత కాలానికి గుర్తుకు వచ్చేనన్న మాట!” అంటూ విశ్వనాధాన్ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు.

‘వీడు తనను మరిచిపోలేదు.’ అనుకున్నాడు విశ్వనాధం. కానీ! వీడిలో ఈ మార్పేమిటి?

మెడలో తళతళలాడే బంగారు గొలుసుతో తెల్లని ఆ పులి గోరు పతకం ఏదీ?!

ధగధగ మెరిసే రాళ్ళతో చేతి వేళ్ళకు ఆ బంగారపుటుంగరా లేవీ?.

సుందర్రామయ్య ఇలా అయిపోయాడేమిటి???

తాను నాలుగేళ్ళ క్రితం చూసిన సుందర్రామయ్యకు—

హఠాత్తుగా పధ్నాలుగేళ్ళ వయసు పెరిగిందా?!!

కనుల వెనుక పట్టుదల, నిశ్చలతపోయి నీరసం, దీనత్వం ఎలా చోటు చేసుకున్నాయి?

తన మనసులో ముద్రింపబడివున్న సుందర్రామయ్య రూపానికి బదులు, ఏదో కదలిపోయిన ఫోటోను చూస్తున్నట్లుంది, విశ్వనాధానికి!

“అలా చూస్తున్నావేంట్రా!” అంటూ అడిగేడు సుందర్రామయ్య.

“నీలో చాలా మార్పు వచ్చిందిరా!” అన్నాడు.

సుందర్రామయ్య నవ్వేడు।

జీవితంలోని ఒడుదుడుకుల నన్నిటినీ జీర్ణం చేసుకుని, ఎంతటి కష్టాన్నయినా స్వీకరించటానికీ సిద్ధపడిన చిరునవ్వులా అనిపించింది అది।

తర్వాత తన భార్య గురించీ, కూతురు లక్ష్మి గురించీ వివరాలు అన్నీ అడిగేరు ఆ దంపతులు

వాళ్ళ మాటల్లో తమ యెడల ఎంతో అనురాగం ధ్వనించింది. శేషమ్మ "మీకు మాటల్లో పడితే ఏమీ గుర్తుండదు। అన్నయ్యగార్ని కాళ్ళూ చేతులూ కడుక్కుని భోజనానికి లేవమనండి" అంటూ వంటింటి వైపుకు సాగిపోయింది

విశ్వనాధం ఊహించుకు వచ్చిన దానికీ—

ఈ ఇంట్లో ప్రస్తుత పరిస్థితులంకూ—

ఎంతో తేడా కనుపిస్తోంది।

ఇంటిలో నౌకర్లు, చాకర్లు లేరు।

సుందర్రామయ్యే స్వయంగా నూతివద్దకు వచ్చి నీళ్ళు తోడేడు।

"ఆకాశం నుండి భగీరధుడు గంగను భూమికి దింపేడు కానీ ఈ ఏజెన్సీ ఏరియాలో పాతాళం నుండీ గంగను జుట్టుపట్టుకుని పైకి లాగాల్సి వస్తోంది."

అంటూ బాల్చి పైకి తీశాడు.

విశ్వనాధం కాళ్ళు కడుక్కున్నాడు.

ఇద్దరూ వంటింటిలోకి తిరిగి వచ్చేరు.

విశ్వనాధం పీటమీద కూర్చుని భోజనానికి ఉపక్రమించేడు.

సుందర్రామయ్య మరో పీట వాల్చుకుని ప్రక్కనే కూర్చుని, కొసరి కొసరి తినిపిస్తూ చిన్ననాటి ముచ్చట్లు ఆరంభించేడు. అతడి ధోరణిలో మార్పు ఏమీ లేదు।

"ఆవకాయ కలపకుండా వదిలేశావేం?" అన్నాడు.

"నీకు తెలుసుగా. చిన్నతనం నుండీ నేను కారం తినటం తక్కువే."

"మీ పశ్చిమ గోదావరి జిల్లా ఆవకాయలా వుండదని భయపడు తున్నావు కాబోలు శేషమ్మ ఆవకాయ పెట్టడంలో మంచి ఎక్స్‌పర్ట్! ఎంత వెనక బడిన విశాఖపట్నం జిల్లాలో బ్రతుకుతున్నా, ఆవకాయ ప్రిపరేషనులో మాత్రం ముందే వున్నాం. ఒకసారి తింటే మరి వదలవు. కలుపుకో!" అంటూ బలవంతంగా ఆవకాయ కలిపించేడు.

శేషమ్మ మిత్రుల కబుర్లు వింటూ, మధ్య మధ్యలో తాను పాలు పంచుకుంటూ, నవ్వుకుంటూ, విసనకర్రతో ఇద్దరికీ గాలి తగి లేలా విసురుతోంది.

విశ్వనాథం భుక్తాయాసంతో విస్తరి దగ్గర నుండి లేచాడు. గది లోకి వచ్చి తన సంచీలోని కేరియరు తీసి సుందర్రామయ్యకు అందిం చేడు.

"అందులో ఏముందో చూడు! మా ఆవిడ నీకోసం చేసి పంపింది" అన్నాడు.

ఆత్రంగా కేరియరు విప్పి అమితానందం పొందేడు, సుంద ర్రామయ్య.

"ఇంకా నా చిన్ననాటి ఇష్టాలు నువ్వు మరిచిపోలేదన్నమాట!" అంటూ శేషమ్మను కేకేసి, "చూడవోయ్! మా చెల్లెమ్మ జున్ను పంపించింది. ఏనాడయినా నా ఇష్టమయినవి నువ్వు చేసిపెట్టావా?" అంటూ ఎగతాళి చేశాడు.

తర్వాత మిత్రులిద్దరూ కబుర్లలోకి దిగేరు.

క్రమంగా మిత్రుని మాటల్లో విశ్వనాథానికి సంగతులన్నీ అవ గతమయ్యేయి.

సుమారు ఎనిమిది నెలల క్రితం—

అడవిలో అగ్నిప్రమాదం సంభవించి, సుందర్రామయ్య కలప అడితి ధ్వంసమయిపోయింది.

అందులో సుమారు నాలుగు లక్షల వరకూ నష్టం వచ్చింది

దానితో అతడి జీవనగతే మారి పోయింది

అప్పుల వాళ్ళు పైన బడటంతో బంగారం, నగలు, యితర విలువయిన సామాన్లు హరించుకు పోయాయి

ఈ కొద్ది వ్యవధిలోనే అతడి బతుకు బజారు పాలయింది.

సుందర్రామయ్య ఈ విషయాలన్నీ తాపీగా వివరించేడు.

"అంత ధైర్యం వున్నవాడు కాబట్టే ఈ పరిస్థితికి తట్టుకుని నిలబడగలిగేడు! తానయితే ఈ సరికి గుండె ఆగి చచ్చిపోయి వుండును" అనుకున్నాడు విశ్వనాధం.

"నీ కొడుకు ఎక్కడా కనబడ్డేం?" అంటూ అడిగేడు.

ఈ సంగతి అడిగేసరికి సుందర్రామయ్య కళ్ళల్లో నీరు తిరగటం గమనించేడు.

"నా దగ్గర వుండి కలప వ్యాపారం చూసుకునేవాడు ఈ సంఘటన జరిగేక వాడు ఉద్యోగంలో చేరవలసి వచ్చింది. బీహారులో వాడి స్నేహితుడి దగ్గరకు వెళ్ళిపోయాడు. అక్కడ నాలుగు వందల జీతం మీద ఉద్యోగం చేస్తున్నాడు. ఇంటికి వందరూపాయలు నెలనెలా పంపుతున్నాడు...." అని కాస్సేపు ఆగి "మహారాజు బిడ్డలా పెంచేను. ఆఖరికి ఇలా అయింది.... కష్టాలు నావికావు. వాడివే!" అన్నాడు.

అతడి కంఠం రుద్ధమయింది.

ఇక ఆ విషయం పొడిగించడం యిష్టంలేక చిన్ననాటి విషయాల మీదకు టాపిక్ మళ్ళించేడు విశ్వనాధం.

ఆ రాత్రి అక్కడే గడిపేడు.

అయితే, తాను ఏ కార్యం మీద వచ్చేడో, అది మాత్రం మనసులో మరుగున పడిపోయింది.

ఆ మర్నాడు ఉదయం ప్రయాణానికి సిద్ధమయ్యాడు.

"మరో రెండు రోజులుండు!" అన్నాడు సుందర్రామయ్య.

విశ్వనాధం అవసరమయితే మరో రెండు రోజులుండాలనే వచ్చేడు. కానీ యిక్కడి పరిస్థితి చూసేక మనసొప్పటం లేదు.

"శెలవల్లేవు! మళ్ళీ రేపుపొద్దుట స్కూలుకు వెళ్ళాలి!" అన్నాడు.

"ఓసారి యిలా వస్తారా?" అంటూ భర్తను లోపలకు పిలిచింది శేషమ్మ. అతడు లోనికి వెళ్ళేడు.

విశ్వనాథం సంచీ సర్దుకుంటూ వుంటే వంటింటిలోంచి ఆ దంపతుల మాటలు మెల్లగా వినిపిస్తున్నాయి.

"....మన అబ్బాయికి వాళ్ళ లక్ష్మిని చేసుకుంటే బాగుంటుంది. మీ స్నేహితుడికి చెప్పండి....ఈ పాటికి నాలుగురాళ్ళు వెనకేసి వుంటాడు...." అంటోంది శేషమ్మ.

"....మన యింటికి వచ్చేడు కదా అని ఇప్పుడే అడిగితే బాగుంటుందా?....నేను మళ్ళీ నెలలో విజయవాడ వెళ్ళాలి....అప్పుడు ఏలూరులో దిగుతాను....విశ్వనాథం మంచివాడే....మన బీదరికం గురించి పట్టించుకోడు.... తప్పకుండా సంబంధానికి ఒప్పుకుంటాడు...." అంటున్నాడు సుందర్రామయ్య. తర్వాత, దంపతులిద్దరూ బయటకు వచ్చేరు.

"మళ్ళీ నెలలో మీ యింటికి వస్తానురా!" అన్నాడు సుందర్రామయ్య.

"తప్పకుండా రావాలి!" అన్నాడు విశ్వనాథం

వాళ్ళిద్దరి దగ్గరా శెలవు తీసుకుని రిక్షా ఎక్కేడు.

రిక్షా ముందుకు కదిలింది.

రిక్షాలో కూర్చున్న విశ్వనాథం మనసులో యిప్పుడు ఒకటే ఆలోచన—

'సుందర్రామయ్య వచ్చి అడిగితే, తన కూతుర్ని అతని కొడుక్కి చేసుకోనని ఎలా చెప్పాలా?' అని !!!

*